1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 102 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 17 ఏప్రిల్ 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 102 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Friday 17 April 2026 PAGES : 8 PRICE : 3/-

## మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు లోక్‌సభలో మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 16)

మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు . చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు ఉద్దేశించిన 3 కీలక బిల్లులను కేంద్రం నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. వీటిపై చర్చలో భాగంగా ప్రధాని మోదీ సభలో ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ల ను వ్యతిరేకించే వారు మూల్యం చెల్లించుకోక తప్పదంటూ విపక్షాలను హెచ్చరించారు.

**గిఫ్ట్ కాదు.. ఇది హక్కు**

"దేశ పార్లమెంట్ చరిత్రలో ఈ రోజును మర్చిపోలేం. మహిళా రిజర్వేషన్ గొప్ప బిల్లు. ఈ చారిత్రక సమయంలో పాలు పంచుకోవడం నా అదృష్టం. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే ▶మిగతా 2లో

## లోకేశ్‌కు పవన్ కల్యాణ్ అభినందనలు కొత్త బాధ్యతల్లో రాణించాలని ఆకాంక్ష



**టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా లోకేశ్ నియామకం**

**లోకేశ్ నియామకం పట్ల సంతోషం వ్యక్తం చేసిన పవన్**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 16)

తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్‌కు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. లోకేశ్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ కొత్త బాధ్యతల్లో ఆయన విజయవంతం ▶మిగతా 2లో

## నారా లోకేశ్ ఒక సైనికుడిలా ముందడుగు వేసి, కేడర్‌లో భరోసా నింపారు: గొట్టిపాటి రవి

**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా లోకేశ్ వెనకడుగు వేయలేదన్న గొట్టిపాటి**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 16)



తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న నారా లోకేశ్‌పై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో లోకేశ్ ఒక సైనికుడిలా ముందడుగు వేసి కేడర్‌లో భరోసా నింపారని ఆయన కొనియాడారు. ▶మిగతా 2లో

# ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం...

## స్వయంగా తన వివరాలు నమోదు చేసుకున్న సీఎం చంద్రబాబు

- ఏపీలో ఇంటింటి గణన, గృహాల జాబితా సేకరణ ప్రారంభం
- స్వీయ నమోదు ప్రక్రియను ఆరంభించిన సీఎం చంద్రబాబు
- ఆన్‌లైన్‌లో తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్న ముఖ్యమంత్రి
- మొత్తం 33 ప్రశ్నలతో కూడిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ
- ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు వివరాలు నమోదు చేసుకునే అవకాశం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 16)

రాష్ట్రంలో గురువారం ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. హౌస్ లిస్టింగ్–హౌస్ సెన్సెస్ ప్రక్రియలో భాగంగా, తొలి వ్యక్తిగా తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రజలందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములై, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.అమరావతిలోని తన నివాసంలో ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ ద్వారా చంద్రబాబు వ్యక్తిగత వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె. నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్ల వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, మే 1 నుంచి 30 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వచ్చి భౌతికంగా వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పౌరులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సమానంగా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనికోసం కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం అవసరమని, ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ▶మిగతా 2లో

## తెదేపా మరింత బలోపేతం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 16)

తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ నాయకత్వం, ఆయన ఆలోచనలతో పార్టీ మరింత శక్తిమంతమవుతుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ ఎంపికపై బుధవారం ఒక ప్రకటనలో మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. 'తండ్రికి తగ్గ తనయుడిగా లోకేశ్ నిలిచిపోతారు. ఓ వైపు పార్టీని, మరో వైపు శాఖను ఎంతో బాధ్యతగా నిర్వర్తిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. విద్య, ఐటీశాఖల్లో అనేక సంస్కరణలు ▶మిగతా 2లో

## నా జీవితం రాష్ట్ర ప్రజలకు, పార్టీ ఆశయాలకు అంకితం



**పార్టీ బలోపేతానికి అలుపెరగక కృషిచేస్తా**

**విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 16)

'నా జీవితాన్ని తెదేపా ఆశయాలు, రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తున్నాను. రాష్ట్రం కోసం నిజాయతీ, నిబద్ధత, లక్ష్యశుద్ధితో, పార్టీ బలోపేతానికి అలుపెరగక కృషిచేస్తాను' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టంచేశారు. తనను పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు హృదయపూర్వక ▶మిగతా 2లో

## జగన్ బతుకే ఒక అరాచకం మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్

**ఐదేళ్లు జువ్వలదిన్నె హార్బర్‌ను అడ్డుకున్నది జగనే అని ఆరోపణ**

**మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీశారని ఘాటు వ్యాఖ్యలు**

**దేశ రక్షణ సంస్థను వ్యతిరేకించడం జగన్ దుర్మార్గపు ఆలోచన అని ఘాటు విమర్శలు**



## మత్స్యకారుల్ని మోసం చేసిన జగన్ ప్రభుత్వం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 16)

ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి కేంద్రం తన వాటాగా రూ.128 కోట్లు ఇచ్చినా వాటిని ఉపయోగించకుండా జగన్ ప్రభుత్వం మళ్లించిందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. వైకాపా పాలనలో మత్స్యకారులను మాటలతో మభ్యపెట్టి మోసం చేశారని విమర్శించారు. కేంద్ర వాటా నిధుల్ని వెంటనే వెనక్కి కట్టాలని, లేకపోతే ఇతర రాయితీలు నిలిపేస్తామని చెప్పారని, కూటమి ప్రభుత్వం వచ్చాకే వాటిని చెల్లించామని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో వేటనిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ.10వేల నుంచి రూ.20 వేలకు పెంచామని.. ఏడాదిలోనే రూ.242 కోట్లకు పైగా సాయం అందించామని వివరించారు. మత్స్యకారులకు చెల్లించాల్సిన పరిహారాన్ని కూడా కూటమి ప్రభుత్వం వచ్చాకే చెల్లించిందని తెలిపారు.

## నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మక ముందడుగు అని కొనియాడిన పవన్
- మహిళా సాధికారతకు జనసేన పార్టీ కట్టుబడి ఉందని స్పష్టీకరణ
- వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ప్రస్తావించిన పవన్
- నారీశక్తి అనేది నినాదం కాదని, మన నాగరికతకు బలమని వ్యాఖ్య
- రాజ్యాంగ రూపకల్పనలో మహిళల పాత్రను గుర్తు చేసుకున్న జనసేనాని



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 16)

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకువచ్చిన 'నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లు' ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో వారికి సముచిత స్థానం దక్కుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు జనసేన పార్టీ మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్న పవన్ కల్యాణ్, "2019 ఎన్నికల్లో మేము వాగ్దానం చేసినట్లుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల పట్ల మా నిబద్ధత, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యంపై మాకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది" అని తెలిపారు. మహిళలు సమాజానికి పునాది అని, కుటుంబాలను తీర్చిదిద్దడం నుంచి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడం వరకు వారి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. ▶మిగతా 2లో

## దేవతలను దానవులే వ్యతిరేకిస్తారు

**జగన్ మావిగన్ ప్రతిపాదన అలాంటిదే**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 16)



అమరావతిని ముఖ్యమంత్రి చంద్రబాబు సహా చాలామంది దేవతల రాజధాని అని అంటున్నందువల్లే జగన్‌కు చిరాకొచ్చి మావిగన్ ప్రతిపాదన చేశారని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు అన్నారు. "దేవతల పేర్లు చెబితే ఇష్టపడనివారు దానవులని, అమరావతిని ▶మిగతా 2లో

# మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు లోక్‌సభలో మోదీ

అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు" అని మోదీ వ్యాఖ్యానించారు.

**ఆ పార్టీలకే మనుగడ..**

"మహిళా రిజర్వేషన్ల కోసం 30 ఏళ్ల పాటు ప్రయత్నాలు జరిగినా గతంలో ఇది సాకారం కాలేదు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లే. ఈ బిల్లును తేవడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరు. బిల్లును వ్యతిరేకించే పార్టీలకు, నేతలకు మహిళలు బుద్ధి చెబుతారు. సమయం చూసి దెబ్బకొడుతారు. మహిళా బిల్లులకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది" అని విపక్షాలకు ప్రధాని చురకలంటించారు.

**దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు..**

"ఈ బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం" అని మోదీ స్పష్టం చేశారు.

**నాకు క్రెడిట్ వద్దు.. మీరే తీసుకోండి**

"ఈ బిల్లుతో దేశంలోని మహిళలకు వారి హక్కులను కల్పిస్తున్నాం. ఈ బిల్లుపై క్రెడిట్ నాకు అవసరం లేదు. మీరే (విపక్షాలను ఉద్దేశిస్తూ) తీసుకోండి.. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి. ఈ బిల్లును అడ్డుకోకుండా సహకరించి మీ గొప్పతనం చాటుకోండి. మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిద్దాం" అని మోదీ విపక్షాలను కోరారు.

# తెదేపా మరింత బలోపేతం

తీసుకొచ్చి రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయం. యువతకు ఉద్యోగాల కల్పన, దేశ విదేశాల నుంచి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు' అని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# నా జీవితం రాష్ట్ర ప్రజలకు, పార్టీ ఆశయాలకు అంకితం

కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ నియామకం నాకెంతో గౌరవంగా భావిస్తున్నాను. నా ఈ ప్రయాణాన్ని తీర్చిదిద్ది, నాపై అచంచలమైన నమ్మకాన్నుంచిన పార్టీ కార్యకర్తలు, నిరంతరం మార్గదర్శకత్వం చేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు. ఒక సామాన్య కార్యకర్త నుంచి ఈ స్థాయి బాధ్యతను స్వీకరించే వరకూ నేను వేసిన ప్రతి అడుగు మీ మద్దతు, పోరాటాలు, త్యాగాల నుంచి నేర్చుకున్న పాఠాల ఫలితం. ఇది పదవి కాదు.. నా జీవితాంతం కొనసాగే బాధ్యత' అని లోకేశ్ పేర్కొన్నారు.

# జగన్ బతుకే ఒక అరాచకం మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 16)**

గొడ్డలి రాజకీయమే జగన్ విధానమని తీవ్ర స్థాయిలో ధ్వజం

వైసీపీ అధినేత జగన్ నిన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యల పట్ల మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో స్పందించారు. జగన్ బతుకే ఒక అరాచకమని, ఆయనకు అభివృద్ధి చేయడం తెలియదని, గొడ్డలి రాజకీయమే తెలుసని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుండటాన్ని చూసి ఓర్వలేకే జగన్ కులాల మధ్య చిచ్చుపెట్టి అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. గురువారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని రవీంద్ర మండిపడ్డారు. "ఐదేళ్ల పాటు నిధులు, బిల్లులు ఇవ్వకుండా హార్బర్ నిర్మాణాన్ని అడ్డుకుని, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసింది జగన్. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగవంతం చేసి, 901 మీటర్ల జెట్టీ, కోల్డ్ స్టోరేజ్‌లతో ఆధునిక హార్బర్‌గా

## మొదటి పేజీ తరువాయి

పూర్తి చేస్తుంటే.. మత్స్యకారులను రెచ్చగొట్టేలా అసత్యాలు మాట్లాడుతున్నారు" అని విమర్శించారు.

**దేశ రక్షణ సంస్థపై జగన్ వైఖరి దుర్మార్గం**

జువ్వలదిన్నెలో దేశ రక్షణకు కీలకమైన 'సాగర్ డిఫెన్స్' సంస్థకు కేంద్ర అనుమతితో భూమి కేటాయిస్తే, దానిని తరిమికొడతాననడం జగన్ దుర్మార్గపు ఆలోచనకు నిదర్శనమని కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "తల్లి, చెల్లిని వెళ్లగొట్టారు, సొంత బాబాయినే వేసేశారు. ఇప్పుడు దేశ రక్షణ సంస్థను కూడా తరిమికొడతానంటున్నారు. అంటే జగన్‌కు దేశం మీద కూడా భక్తి లేదు. ఆయనకు తెలిసింది గొడ్డలి పార్టీ, గొడ్డలి గుర్తు.. నరుక్కుంటూ పోవడమే" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**అభివృద్ధి, పెట్టుబడులకు జగన్ శత్రువు**

గత ఐదేళ్లలో 800 పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన చరిత్ర జగన్‌దని రవీంద్ర ఆరోపించారు. "కియా, అమరరాజా వంటి సంస్థలను బెదిరించి పొరుగు రాష్ట్రాలకు పంపారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారు. నేను వస్తే చట్టాలు మార్చేస్తానంటూ పెట్టుబడిదారులను మళ్లీ భయపెట్టాలని చూస్తున్నారు. విధ్వంసమే నైజంగా ఉన్న జగన్‌ను ప్రజలు నమ్మకే 11 సీట్లకు పరిమితం చేశారు" అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, జీవో 217ను రద్దు చేసి, వేట నిషేధ భృతిని పెంచి, వారికి అండగా నిలుస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**తమిళనాడు బోట్ల విడుదల అంశంలో జగన్ దుష్ప్రచారం**

తమిళనాడు మత్స్యకారుల బోట్లను పట్టుకున్న తర్వాత, వాటిని యువనేత నారా లోకేశ్ చెప్పడం వల్లే పోలీసులు విడుదల చేశారని జగన్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం, దురదృష్టకరం అని కొల్లు రవీంద్ర కొట్టిపడేశారు. ఈ అంశాన్ని రాజకీయంగా మార్చి లబ్ధి పొందాలని జగన్ ప్రయత్నించడం బాధాకరమని అన్నారు.

వాస్తవానికి, ఈ బోట్ల విషయంలో స్థానిక గ్రామాల ప్రజలు జోక్యం చేసుకున్నారని వెల్లడించారు. "ఇది మా గ్రామాల మధ్య ఉన్న సమస్య. మేమే చర్చించుకుని పరిష్కరించుకుంటాం" అని వారు కోరారని తెలిపారు. వారి అభిప్రాయాన్ని, ఐక్యతను గౌరవిస్తూ, వారి నిర్ణయం ప్రకారమే మేము ముందుకు వెళ్లాం... అంతేకానీ, ఇందులో లోకేశ్ గారి ప్రమేయం ఉందనడం పచ్చి అబద్ధం అని కొల్లు రవీంద్ర వివరించారు. "నిజానికి, సముద్ర గస్తీ విషయంలో గత జగన్ ప్రభుత్వ హయాంలోనే తీవ్ర నిర్లక్ష్యం జరిగింది. 2017 వరకు ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా మెరైన్ బోట్లు గస్తీ కాస్తుండేవి. కానీ 2019 తర్వాత ఆ గస్తీ పూర్తిగా నిలిచిపోయింది. బోట్ల రిపేర్లు, మెయింటెనెన్స్‌కు నిధులు ఇవ్వకపోవడం, సిబ్బందిని తొలగించడం వంటి చర్యలతో సముద్ర సరిహద్దులు బలహీనపడ్డాయి. ఆ కారణంగానే తమిళనాడు బోట్లు మన సముద్ర జలాల్లోకి చొరబడి మత్స్య సంపదను దోచుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని గుర్తించిన వెంటనే చంద్రబాబు నాయుడు గారు, నారా లోకేశ్ గారు అధికారులను అప్రమత్తం చేశారు. తక్షణమే 650 హార్స్ పవర్ ఇంజిన్లతో కూడిన స్పీడ్ బోట్లను ఏర్పాటు చేసి గస్తీని పటిష్టం చేశాం. అక్రమంగా ప్రవేశిస్తున్న బోట్లను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. వాస్తవాలు ఇలా ఉంటే, జగన్ మాత్రం నిజాన్ని దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు" అని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.

# నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం

"మహిళ ఎదిగితే దేశం ఎదుగుతుంది. ఇది వారికి కొత్త హక్కులు ఇవ్వడం కాదు, వారికి న్యాయంగా చెందాల్సిన వాటిని తిరిగి ఇవ్వడం. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను నిర్మిస్తారు. బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయి. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదం కాదు, మన నాగరికతకు బలంగా నిలుస్తుంది. న్యాయమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి ఈ స్ఫూర్తితో ముందుకు సాగుదాం" అని పవన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ఆయన కొనియాడారు. సైప్రస్‌లో జరిగిన ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో గెలిచి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌కు సవాల్ చేసే హక్కును పొందిన తొలి భారతీయ మహిళగా ఆర్. వైశాలి చరిత్ర సృష్టించడాన్ని ప్రస్తావించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇస్రో శాస్త్రవేత్త రీతూ కరిధాల్ నుంచి ఒలింపిక్స్‌లో పీవీ సింధు, మీరాబాయి చాను, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ వరకు ఎందరో మహిళలు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మీ పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి వారి సేవలను పవన్ గుర్తు చేసుకున్నారు. "ప్రతిభకు అవకాశం తోడైనప్పుడు, మహిళలు నాయకత్వం వహిస్తారు, రాణిస్తారు, దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తారని ఈ విజయాలన్నీ నిరూపిస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

# దేవతలను దానవులే వ్యతిరేకిస్తారు

దేవతల రాజధాని అనడం మానేస్తే.. మావిగన్ అంటూ కొత్త పేర్లు పెట్టడం మానేస్తారేమో' అని వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. జగన్ చెబుతున్నట్లు మచిలీపట్నం, గుంటూరు హైవే మీద కొత్తగా రాజధాని కోసం భూమిని సేకరించగలరా? అని ప్రశ్నించారు.

**ఆకివీడులో రామాలయం 1932 నుంచే ఉంది**

ఆకివీడులో 1932 నుంచి ఉన్న రామాలయం స్థానంలోనే కొత్తది కట్టేందుకు అనుమతుల్లేవంటున్నారని రఘురామ పేర్కొన్నారు. 'నా నియోజకవర్గంలోని రామాలయంలోకి ఎమ్మెల్యేగా నేను వెళ్లేందుకు క్రైస్తవుల అనుమతి తీసుకోవాలా? హిందువులుగా మేం రామాలయానికి కాకుండా కల్వరి టెంపుల్‌కి వెళ్లాలా' అని ప్రశ్నించారు. 'ఆకివీడు మండలంలోనే 113 అనుమతుల్లేని చర్చిలున్నాయి. వీటన్నింటిపైనా చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. 'సతీశ్‌కుమార్ అనే ఫాదర్ తాడేపల్లిగూడెం వద్ద కుంచెనపల్లిలో కట్టిన కల్వరి టెంపుల్, గుంటూరు సమీపంలోని నంబూరులో కట్టిన చర్చికి అనుమతుల్లేవు. వాటికి 4లక్షల మంది వస్తారట. కొంతమందికి అవి 4లక్షల ఓట్లలా కనిపిస్తాయి కాబట్టే చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తారు. కేవలం ఓట్ల కోసం రాజకీయం చేయడం సరికాదు' అని వ్యాఖ్యానించారు.

**పాస్టర్లలో 50శాతం మందికి ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు**

రాష్ట్రంలోని పాస్టర్లలో 50శాతం మందికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలున్నాయని సమాచారహక్కు కింద తీసుకున్న సమాచారంలో వెల్లడైందని రఘురామ తెలిపారు. "ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలు మావే. వీటిలో 1.60కోట్ల మంది క్రైస్తవులున్నాం. మేం ఎవరంటే వారే ఇక్కడ గెలుస్తారంటూ అజయ్‌కుమార్ అనే పాస్టర్ మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో 22 శాతం మంది క్రైస్తవులున్నా, రికార్డుల్లో 2శాతమే చూపించుకుంటున్నారు. పూర్తి క్రైస్తవులుగా ఎందుకు చెప్పుకోలేరు' అని ప్రశ్నించారు. పీవీ సునీల్‌కుమార్, జడ శ్రావణ్‌కుమార్, విజయ్‌కుమార్, హర్షకుమార్‌లు మతం మారినా కులం మారుతుందా అని వాదిస్తున్నారని విమర్శించారు.

# లోకేశ్‌కు పవన్ కల్యాణ్ అభినందనలు కొత్త బాధ్యతల్లో రాణించాలని ఆకాంక్ష

కావాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వంలో మంత్రిగా ఇప్పటికే తనదైన ముద్ర వేస్తున్న లోకేశ్, ఇప్పుడు పార్టీ పరంగా కీలకమైన బాధ్యతలు చేపట్టడం శుభపరిణామమని పేర్కొన్నారు. నారా లోకేశ్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత శక్తిమంతంగా ముందుకు సాగాలని, యువతకు ఆదర్శంగా నిలవాలని పవన్ కల్యాణ్ కోరుకున్నారు. ఇప్పటికే తన శాఖల ద్వారా రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న ఆయన, పార్టీని కూడా అదే స్థాయిలో బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ లోకేశ్ తన సమర్థతను చాటుకుంటారని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని పవన్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# నారా లోకేశ్ ఒక సైనికుడిలా ముందడుగు వేసి, కేడర్‌లో భరోసా నింపారు: గొట్టిపాటి రవి

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా, యువగళం పాదయాత్రలో అనేక ఆంక్షలు ఎదురైనా రాష్ట్ర ప్రజల కోసం లోకేశ్ వెనకడుగు వేయకుండా పోరాడారని మంత్రి గుర్తుచేశారు. ఒంగోలులో నిర్వహించిన మహానాడు విజయవంతం కావడం వెనుక లోకేశ్ సమర్థవంతమైన సమన్వయం ఉందని పేర్కొన్నారు. టీడీపీని కోటి మంది సభ్యత్వం కలిగిన శక్తివంతమైన ప్రాంతీయ పార్టీగా తీర్చిదిద్దిన ఘనత లోకేశ్‌దేనని ఆయన చెప్పారు. ముఖ్యంగా కార్యకర్తల కోసం 'కార్యకర్తల సంక్షేమ నిధి'ని ఏర్పాటు చేయడం, వారికి ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించడం వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయన ప్రస్తావించారు. ఒకవైపు పార్టీ బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు మంత్రిగా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తున్నారని మంత్రి ప్రశంసించారు. విద్యా విధానంలోనూ ఆయన అనేక సంస్కరణలు తీసుకువచ్చి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపునిస్తూ, ఆధునిక ఆలోచనలతో పార్టీని నడిపిస్తున్న లోకేశ్ నాయకత్వం రాష్ట్రానికి, పార్టీకి కొండంత అండ అని గొట్టిపాటి రవికుమార్ అభిప్రాయపడ్డారు.

# ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం...

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో జనగణన జరగడం ఇదే తొలిసారి అని, ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో భాగంగా ప్రస్తుతం ఇళ్ల గణన ప్రారంభమైందని, వచ్చే ఏడాది రెండో దశలో జనాభా లెక్కల సేకరణ చేపడతారని సీఎం వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ నమోదు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ సరైన వివరాలు నమోదు చేసి ఈ బృహత్కార్యాన్ని విజయవంతం చేయాలని కోరారు.









# విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 16)**


ఇంటర్మీడియట్ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించిన కందుకూరు పట్టణంలోని సాయిబాబా ఐఐటి-జేఈఈ, నీట్ అకాడమీ విద్యార్థులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం అభినందించారు. మొదటి సంవత్సరం పరీక్షల్లో 470 మార్కులకు గాను దాసరి రేణుక వెంకటలక్ష్మి, ముచ్చు గోపీనాథ్ 466 మార్కులు సాధించారు. రెండవ సంవత్సరం పరీక్షల్లో జజ్జారపు లక్ష్మి 1000 కిగాను 991 మార్కులు సాధించింది. స్థానిక టిడిపి కార్యాలయంలో విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ గొర్రెపాటి రామారావు, కరస్పాండెంట్ గుంటూరు శ్రీనివాసులు, డైరెక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ కార్పొరేట్ సాలరీ ప్యాకేజ్ కింద రూ.1.20 కోట్లు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చెల్లింపు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 16)**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న కార్పొరేట్ సాలరీ ప్యాకేజ్ ద్వారా మరో ముఖ్యమైన ఇన్సూరెన్స్ క్లెయిమ్ వేగంగా పరిష్కరించబడింది. ప్రమాదంలో మరణించిన ఏపీ సచివాలయం ఉద్యోగి పొదిలి భార్గవనాథ్ భార్య పొదిలి భావిత కి రూ. 1,20,00,000 (ఒక కోటి ఇరవై లక్షలు) విలువైన చెక్కును జిల్లా కలెక్టర్ పి రాజా బాబు చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ యూనియన్ బ్యాంక్ అందిస్తున్న కార్పొరేట్ సాలరీ ప్యాకేజ్‌లోని ఇన్సూరెన్స్ సదుపాయాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకం ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి వి రవి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు మార్కెట్లో అత్యుత్తమ ప్రయోజనాలు యూనియన్ బ్యాంక్ అందిస్తున్నదని తెలిపారు. క్లెయిమ్‌ను తక్కువ సమయంలోనే పరిష్కరించడం బ్యాంక్ సేవల నాణ్యతను ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రమేష్, ఆర్ఏబిడి మేనేజర్ షహీర్, తిమ్మసముద్రం బ్రాంచ్ హెడ్ గిరిప్రసాద్, గవర్నమెంట్ రిలేషన్‌షిప్ మేనేజర్ రామ్ గోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

17.04.26    శుక్రవారం




# మార్కాపురం పట్టణంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## పన్ను వసూళ్ల నిర్లక్ష్యం పై మున్సిపల్ సిబ్బంది పై మండిపాటు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 16)**

మార్కాపురం పట్టణంలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్ళి కౌన్సిల్ ఛాంబర్, కార్యాలయ ఆవరణను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌కు వెళ్లి రికార్డులను పరిశీలించి, పన్ను వసూళ్ల తీరు పై అసహనం వ్యక్తం చేశారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం వసూలు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. ఈ విషయంలో మున్సిపల్ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. ప్రతినెల సచివాలయం సిబ్బంది కి టార్గెట్లు ప్రకటించి తనకు రిపోర్టు పంపాలని కమిషనర్ ను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని 16వ సచివాలయానికి చేరుకొని అక్కడ సైతం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

పన్ను వసూళ్ల లో నిర్లక్ష్యం చేయకుండా ముందుకు సాగాలన్నారు. అక్కడి నుంచి ఎస్‌వికెపి కళాశాల నుంచి మార్కెట్ యార్డ్ వరకు రోడ్డు మధ్యలో నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అదేవిధంగా ఎండిపోయిన మొక్కలు స్థానంలో కొత్త వాటి నాటాలన్నారు. అనంతరం తర్లుపాడు రోడ్డులోని నీటి ట్యాంక్ వద్దకు వచ్చి నీటి శుద్ధి కేంద్రాలు, ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. నీటి పంపింగ్, నీటి నాణ్యత పరీక్షల విధానాన్ని మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో లేకేజిల సమస్యలు లేకుండా స్వచ్ఛమైన నీటిని పట్టణ ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఏఈ భూపాల్‌రెడ్డి, సర్వేయర్ సంజీవయ్య, ఇతర మున్సిపల్ సిబ్బంది ఉన్నారు. (తరువాయి 4లో...)

# కొరిశపాడు వైసీపీ ఇలాకాలో టీడీపీ పాగా!

▶ వైసీపీకి దూరంగా ఉంటున్న క్యాడర్ ▶ కార్యకర్తలు అదే పరిస్థితి ▶ వైవి సొంత ఊర్లో టిడిపిదే హవా

**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 16)**




మండలంలోని 15 గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలలో మారుతున్న సమీకరణలతో వైసిపి పరిస్థితి మరింత దిగజారుతుంది. ముఖ్యంగా మొదటి నుంచి వైసిపికి కంచుకోట లా ఉన్న కొరిశపాడు గ్రామంలో ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొరిశపాడు, మేదరమెట్ల, ఒకటి రెండు గ్రామాలు మినహా మిగిలిన గ్రామాలు టిడిపికి మెజార్టీగా ఉన్నాయి. అయితే 2024లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కొరిశపాడు లో వైసిపికి సుమారు 5 వందలు ఉన్న మెజార్టీ 350 కి పడిపోయింది. మండలంలోని గ్రామాలకు పుష్కలంగా నీరు అందించేందుకు దివంగత నేత రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోలిరెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. ఆయన చనిపోయిన తర్వాత ఆ ప్రాజెక్టు మూలన పడింది. నిర్వాసితులకు ఎలాంటి పరిహారము, స్థలాలు ఇవ్వలేదు. సుబ్బారెడ్డి, భద్రారెడ్డి పట్టించుకోలేదని వార్తలు వినిపించాయి. ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ అప్పుడు టిడిపిలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రాజెక్ట్ ఫైల్ ను చక చక కదిలించాడు. అయితే గ్రామస్తులు సహకరించకపోవడంతో ముందుకు సాగలేదని కొంతమంది ఆరోపణలు చేశారు. ఆ తర్వాత చేతులారా రవికుమార్ సహకారం అందించినప్పటికీ అంది వచ్చిన దాన్ని జారవిడుచుకున్నామని గ్రామస్తులు వారిలో వారే చర్చించుకున్నారు. అయితే ప్రస్తుతం ఇప్పుడు ఆ ప్రాజెక్టు పూర్తి చేయడానికి మంత్రి రవికుమార్ చర్యలు తీసుకోవడంతో అధికారులు కార్యచరణ మొదలుపెట్టారు. మంత్రి రవికుమార్ సహకారంతో నిర్వాసితులకు న్యాయం చేసి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామస్తులు నుంచి పార్టీలకు అతీతంగా హర్షధ్వనాలు వ్యక్తమయ్యాయి. స్థానిక నాయకులు కూడా పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయటంతో ప్రజల్లో టిడిపికి మరింత సానుకూలత పెరిగింది. ఈ నేపథ్యంలో వైసీపీకి ఉన్న కొద్ది మెజార్టీ కూడా టిడిపి ఖాతాలోకి పోతుందని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. ఇకపోతే ఎప్పుడు లేని విధంగా వైసీపీకి మెజార్టీ ఉన్న మేదరమెట్లలో టిడిపి 811 ఓట్ల మెజార్టీతో చరిత్ర సృష్టించింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత బాబాయి అయిన వై వి సుబ్బారెడ్డి ఊరు అయిన మేదరమెట్లలో టిడిపి నాయకులు బంపర్ మెజార్టీతో రికార్డ్ సృష్టించారు. గ్రామంలో సామాజిక వర్గాలతో మమేకమై, సొంత డబ్బులతో వారి అవసరతలు తీరుస్తూ, చేదోడు వాదోడుగా నిలబడ్డారు. దీంతో వారి గెలుపు అక్కడి నుంచే పునాదిగా మారింది. ఎవరు ఊహించని విధంగా బంపర్ మెజార్టీని మంత్రి రవికుమార్ కు వారు గిఫ్ట్ గా ఇచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి ప్రస్తుత ఇంచార్జ్ అశోక్ కుమార్ అంటే ఎవరో కార్యకర్తలకు తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికి వారు హనీమిరెడ్డి నే ఇంచార్జ్ గా భావిస్తున్నారు. దీనికి కారణం అశోక్ కుమార్ ఇంతవరకు మండలంలో కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయకపోవడం, పార్టీస్థితిగతులపై చర్చించి సరిదిద్దకపోవటమే ఇందుకు కారణం అని పార్టీలోని సీనియర్ నాయకులు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది నాయకులు అయితే అసలు పార్టీ కార్యక్రమాలకే దూరంగా ఉంటున్నారు. మండలంలో కార్యకర్తలను నడిపించే సరైన నాయకుడు లేకపోవటమే ఇందుకు కారణమని వారు ఆరోపిస్తున్నారు. ఇది ఇలానే కొనసాగితే రాబోయే స్థానిక సంస్థల, అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాలలో టిడిపి క్లీన్ స్లీప్ చేస్తుందని అంటున్నారు. మొత్తం మీద కొరిశపాడు మండలం టిడిపికి కంచుకోటలా మారింది.

# నారి శక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## జిల్లా కలెక్టర్ విజయ సునీత



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 16)**

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు రేపు(శుక్రవారం) పార్లమెంట్లో ఆమోదం పొందనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించబోయే 'నారీ శక్తి ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె జిల్లాలోని ఆర్డీవో లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవో, తాహసిల్దార్లు , ఐసిడిఎస్, డ్వామా అధికారులతో కలెక్టర్ కార్యాలయం నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని మహిళా మణులతో ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి వెయ్యి నుంచి 2వేల మంది కార్యక్రమానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రత్యేక సాంస్కృతి కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేయాలని తెలిపారు.

# ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలి

## రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పిలుపు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)**

జనగణన-2027 ప్రక్రియ 'స్వీయ గణన' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పిలుపు నిచ్చారు. గురువారం ఉదయం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు ఆధ్వర్యంలో 'స్వీయ గణన' కింద తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, జనగణన-2027 ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొదటిసారిగా 'స్వీయ గణన' కార్యక్రమంలో భాగంగా వివిధ వర్గాల ప్రజలు తామే స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునేందుకు వీలుగా ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు 15 రోజుల పాటు షెడ్యూల్ జారీ చేయడమైనదన్నారు. అందులో భాగంగా తాను స్వయంగా జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు ఆధ్వర్యంలో 'స్వీయ గణన' కార్యక్రమం నిర్వహణలో భాగంగా తన కుటుంబ వివరాలను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో 2412 బ్లాకులుగా, పట్టణ ప్రాంతంలో 845 బ్లాకులుగా మొత్తం 3255 బ్లాకుల్లో జనగణన కార్యక్రమం జరుగు తుందన్నారు. అందుకు గాను క్షేత్ర స్థాయి సిబ్బందిని నియమించడంతో పాటు వీరికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. (తరువాయి 4లో...)

# టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవిల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తండ్రి నారాయణరెడ్డి





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 16)**

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవి దంపతుల ఆధ్వర్యంలో పొదిలి పట్టణంలోని పెద్ద బస్టాండ్ సెంటర్‌లో గత 12 సంవత్సరాలుగా నిర్విరామంగా వేసవి కాలంలో ప్రజల దాహార్తినితీర్చేందుకు స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్ నందు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగా గురువారం పెద్ద బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తండ్రి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చలివేంద్రాన్ని పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేష్ కుమార్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా నారాయణరెడ్డి గునుపూడి భాస్కర్ ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గునుపూడి భాస్కర్ దంప తులు నారాయణరెడ్డికి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా రెండో పర్యాయం నియమితులైనందుకు నారాయణరెడ్డి గునుపూడి భాస్కర్‌కు స్వీటు తినిపించి శు భాకాంక్షలు తెలియజేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గత 12 సంవత్సరాలుగా నిర్విరామంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న గునుపూడి భాస్కర్ దంపతుల సేవలు మరువలేనివన్నారు. ఈ మండుటెండల్లో చల్లటి మంచినీరు ప్రజలు, ప్రయాణీకులకు అందించాలనే నిర్ణయం ఎంతో మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడంలో గునుపూడి కుటుంబం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ రాజేష్ కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

## గుండ్ల సముద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న సిడిపిఓ సుశీల దేవి



(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఏప్రిల్ 16)
మండలంలోని గుండ్ల సముద్రం సచివాలయం పరిధిలోని గుండ్ల సముద్రం ఎస్సీ 2, సెంటర్లో పోషణ పక్వాడ లో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్యఅతిథిగా కొండపి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ సుశీలదేవి పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ పిల్లలకు సెల్ ఫోన్ ప్రభావం తగ్గించాలని, మొబైల్ పిల్లలు వాడడం ద్వారా పిల్లలకు సరైన బ్రెయిన్ డెవలప్మెంట్ ఉండదని ఆమె అన్నారు. జంక్ ఫుడ్ ప్రభావాన్ని తగ్గించాలని తల్లులకు సూచనలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలములోని అన్ని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల పై అవగాహన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)





అగ్నిమాపక వారోత్సవాలు-2026 కార్యక్రమంలో భాగంగా గురువారం ఒంగోలు నగరంలో గల భాగ్యనగర్ సెకండ్ లైన్ సాయి క్రియేటివ్ అపార్ట్మెంట్ లో గల నివాస గృహముల సముదాయం నందు ఉన్న ప్రజలకు నివాస గృహముల యందు జరుగు వంటగ్యాస్ ఫైర్స్, ఆయిల్ ఫైర్స్, ఎలక్ట్రికల్ ఫైర్స్ ( ఎక్స్, రెఫ్రిజిరేటర్, స్విచ్ బోర్డ్స్) అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ విధంగా నివారించాలో మాక్ డ్రిల్ ద్వార అవగాహన కల్పించారు. అక్కడికి వచ్చిన ప్రజలకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన తెలియపరిచే కరపత్రాలు పంపిణీచేశారు. తదుపరి పోస్టర్స్ గోడల పై అంటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి కె శ్రీకాంత్‌రెడ్డి, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## క్విస్ కళాశాలలో విజయవంతంగా ముగిసిన డ్రోన్ వర్క్ షాప్

రెండు రోజుల పాటు సాగిన వర్క్ షాప్
డ్రోన్ టెక్నాలజీ పై అవగాహన పెంచుకున్న విద్యార్థులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)
ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన డ్రోన్ వర్క్ షాప్ గురువారంతో ముగిసింది. ఆధునిక డ్రోన్ టెక్నాలజీ, పనితీరుతో పాటు డ్రోన్ అసెంబ్లింగ్ తదితర అంశాలను ఈ రెండు రోజులు బోధించారు. డ్రోన్ టెక్నాలజీలో నిష్ణాతులైన ఫ్యాకల్టీ ప్రత్యేక శిక్షణను అందించారు. డ్రోన్ కి సంబంధించి ప్రాక్టికల్ అంశాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఇండస్ట్రీ అవసరాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో స్వయంగా డ్రోన్ కాంపౌండ్స్ ను అసెంబుల్ చేయించారు. ప్రస్తుతం సమాజంలో ఉన్న ట్రెండింగ్ విషయాలను, వాటిపై విద్యార్థులకు అవగాహన ఉండాలనే ఉద్దేశంతో క్విస్ కళాశాలలో ఇలాంటి వర్క్ షాప్ లు నిర్వహిస్తామని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రి దేవి అన్నారు. విద్యార్థులు ఎప్పిటికప్పుడు ట్రెండింగ్ లో ఉన్న సాంకేతిక అంశాలను తెలుసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. రెండు రోజుల డ్రోన్ వర్క్ షాప్ తమకు ఎంతగానో ఉపయోగపడిందని, చాలా ఆసక్తికరమైన, నూతన సాంకేతికతను తెలుసుకున్నామని ఈ సందర్భంగా విద్యార్థులు అన్నారు. ఇంత గొప్ప అవకాశాలను కల్పిస్తున్న క్విస్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ రెండు రోజుల వర్క్ షాప్‌ని క్విస్ కళాశాల ప్రాడెక్ట్ డీన్ డాక్టర్ మౌళి చంద్ర పర్యవేక్షించారు.

## మార్కాపురం పట్టణంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు










## ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలి



మే 1వ తేదీ నుండి నెల రోజుల పాటు ఎన్యుమరేటర్స్ వచ్చి ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ జనగణనలో ఏ కుటుంబం మిస్ కాకుండా చూడాలని, ఈ విషయమై ఎన్యుమరేటర్స్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలు అందుబాటులో వున్న సమయాన్ని ఎన్యుమరేటర్స్ కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా ఈ జనగణన కార్యక్రమానికి సహకరించి తమ వివరాలను తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు మండల తహసిల్దార్ ఆంజనేయులు, జనగణన నమోదు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవిల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు





# కళ ప్రజల విముక్తి కోసం పాటుపడాలి

ఒంగోలు నగరంలో ఘనంగా ప్రారంభమైన అరుణోదయ రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)
ప్రపంచీకరణ నేపథ్యంలో పాలక వర్గాలు అమలు చేస్తున్న అభివృద్ధి విధానాలు సమాజంలో అసమానతలను మరింత తీవ్రతరం చేస్తున్నాయని, విద్య, వైద్యం వంటి మౌలిక హక్కులకు ప్రజలు దూరమవుతున్నారని, రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారరని, దళితులు భూమి-విద్యలకు ఇంకా దూరంగానే ఉన్నారని, సామాజిక వివక్షతకు అణిచివేతకు గురువుతున్నారని మహిళలు అత్యాచారాలు, హత్యలు, అవమానాలకు గురవుతున్నారని ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు పరిష్కార మార్గాలను చూపించే బాధ్యత కళాకారులపై ఉందని ప్రముఖ నాటక రచయిత పాడిబండ్ల ఆనందరావు అభిప్రాయపడ్డారు. సభ ప్రారంభానికి ముందుగా ఒంగోలు శర్మ కాలేజీ దగ్గర కామ్రేడ్ ఎంఎంఎస్ భవన్ ప్రాంగణంలో డబప్పుల ప్రదర్శన, బొమ్మరిల్లు బాల కళాకారులు కోలాట ప్రదర్శన ప్రజల్ని ఎంతో ఉత్తేజితులు చేశాయి. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు చొప్పర జాలన్న జెండా ఆవిష్కరణతో శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు చొప్పరజాలన్న,, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నసెట్టి రాజశేఖర్, సి నాగరాజు, జయలక్ష్మి అధ్యక్ష వహించారు. శిక్షణ శిబిరంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ పాట పుట్టుక నేపథ్యాన్ని వివరించారు. ప్రజా కళా ఉద్యమానికి మార్గదర్శకులైన గరికపాటి రాజారావు, పాణిగ్రాహి సుబ్బారావు, కానూరి వెంకటేశ్వరరావు, రామారావు వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువ కళాకారులను చైతన్యవంతులను చేయడం ఈ శిబిరాల ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో భూస్వామ్య, సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ సంస్కృతులు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ప్రజా సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సభలో వక్తలు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రతిబింబించే కళా రూపాల ద్వారా ప్రజలను చైతన్యపరిచి పోరాటాలకు సమీకరించడం, కాలానుగుణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సభలో రాష్ట్ర అధ్యక్షుడు చొప్పర జాలన్న, ఉపాధ్యక్షులు సి నాగరాజు, అంజయ్య, కోశాధికారి జయలక్ష్మి, అలాగే రామకృష్ణ, సోమేశ్వర్, గోపాలం తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరాల ద్వారా ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి కొత్త ఊపిరి లభిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి జూ సాగర్, పివోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పద్మ, పిడిఎస్ యూ

# జిల్లాలో భానుడి భగభగలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)
జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో ప్రజలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో వడగాలుల తీవ్రత జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. మధ్యాహ్నం సమయంలో ఎప్పుడు రద్దీగా ఉండే రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. ఎండ తీవ్రతకు చల్లటి పానీయాలు తాగేందుకు, పుచ్చకాయలు లాంటివి తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ తెలియజేస్తుంది.









# పెయ్యా దూడల ఉత్పత్తి పథకం

## పశుపోషకులకు వరమలాంటిది

### - ప్రకాశం జిల్లా పశుసంవర్ధక శాఖ - డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ





**(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, ఏప్రిల్ 16)**
రాష్ట్రీయ గోకుల మిషన్ సౌజన్యంతో పెయ్యిదోడల ఉత్పత్తి పథకం గ్రామీణ సంపద పెంపుదలకు ఉత్తమ మార్గమని ప్రకాశం జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మురళి కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రమైన మద్రిపూడి పశువైద్యశాఖ డాక్టర్ మణిశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన పెయ్య దూడల ప్రదర్శన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో 55 గర్భకోశ ఉత్పత్తుల సభలు నిర్వహించామని ఇది 56వ సభాని ఆయన అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆదేశాల మేరకు మేలు జాతి దూడల అభివృద్ధికి ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేకించి మంత్రి వాళ్లు పోస్టర్లను రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయాలని కూడా సూచనలు ఇచ్చారని తెలిపారు. పశుపోషకులు కృత్రిమ గర్భకోశ దూడలు అభివృద్ధికి తోడ్పడాలన్నారు,ముఖ్యంగా గేద ఈనిన అర్ధగంటలోనే దూడకు పాలు పట్టించాలని సూచించారు. ఈకారణంగా దూడ ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు,పుట్టిన దూడకు ఆపు ఇంచ వదిలేసి బొడ్డును కత్తిరించాలని కూడా చెప్పారు. ఈ కారణంగా పలు వ్యాధులకు దూడ దూరం అవుతుందని రైతులను ఉద్దేశించి మెళుకులను సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం దూడలకు ఎదకు ఉపయోగించే టీకాను కేవలం 150 రూపాయలకే అందజేస్తున్నామని ఈ విషయాన్ని రైతులందరూ గమనించి ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని రైతులను కోరారు. ఈ ఎద టీక వల్ల 90 శాతం పెయ్యి దూడలు పుడతాయని కూడా ఆయన పుశు పోషకులకు వివరించారు. పశువైద్యాధికారి డాక్టర్ మణి శేఖర్ మాట్లాడుతూ పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో ఇంత భారీ స్థాయిలో జరగటం మండల చరిత్రలోనే ఇది మొదటిసారి అన్నారు. ఈ క్యాంపు ద్వారా అనేకమంది పశు పోషక రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కాకర్ల పశువైద్యాధికారి డాక్టర్ పేరయ్య ప్రసంగిస్తూ పెయ్యి దూడల కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మూడు సంవత్సరముల దూడలకు సబ్సిడీ ద్వారా పలు రకాల పోషక పదార్థాలు అందజేస్తామన్నారు. ఎదకు వచ్చిన 12 గంటల్లోపే ఏద టీక వేయించాలని రైతులకు సూచనలు ఇచ్చారు. మద్రిపూడి సొసైటీ ప్రెసిడెంట్ ఎర్ర మోతు శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతి ఒక్క రైతు ఉపయోగించుకొని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. సబ్సిడీ ద్వారా మందులు దాన టికాలు ఇవ్వడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు పసుపులకు చెందిన జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ జాతి దూడల ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి ఒక్క రైతుకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు తుళ్లూరి నరసింహారావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సారెడ్డి యోగిరెడ్డి, చేరెడ్డి నర్సారెడ్డి, చేరెడ్డి రమణారెడ్డి, పశువైద్య శాఖ సిబ్బంది, మహిళ రైతులు, పసుపోషకులు, తదితరులు పాల్గొన్నారు.



---

## తెలుగుదేశం పార్టీలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం పై హర్షం వ్యక్తం చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

### ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, కొమ్మాలపాటి శ్రీధర్ లకు అభినందనలు తెలిపిన జీవీ



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 16)**
తెలుగుదేశం పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీల నియామకాల్లో పల్నాడు జిల్లాకు పెద్దపీట వేయడంపై ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును పొలిట్ బ్యూరో ఎక్స్ అఫిషియో మెంబర్‌గా, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను జాతీయ ఉపాధ్యక్షుడిగా, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మరియు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావును జోనల్ కోఆర్డినేటర్‌గా నియమించడం ద్వారా పార్టీ అధిష్టానం పల్నాడు జిల్లా ఆవశ్యకతను చాటిచెప్పిందని ఆయన పేర్కొన్నారు. ఈ నియామకాలు పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని మరోసారి నిరూపించాయని, రానున్న రోజుల్లో కూడా ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ, రాష్ట్ర కమిటీల్లో స్థానం పొందిన నాయకులందరూ నారా లోకేష్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తూ, భవిష్యత్తులో టీడీపీ మరిన్ని చారిత్రాత్మక విజయాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పదవులు పొందిన వారు తమ అనుభవంతో పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరుతూ అందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## దేశ చరిత్ర లో తొలిసారి డిజిటల్ 'స్వీయ జన గణన'' ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 16)**
భారతదేశ చరిత్రలో తొలిసారిగా ప్రవేశపెట్టిన డిజిటల్ 'స్వీయ గణన' ప్రక్రియను వినుకొండలోని తన కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు గురువారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026 జనాభా గణనలో భాగంగా ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డుల ద్వారా వెబ్ పోర్టల్‌లో లాగిన్ అయ్యి, కుటుంబ సభ్యుల విద్య, ఉద్యోగ, వసతుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈ డిజిటల్ విధానం వల్ల డేటా సేకరణ వేగవంతం కావడమే కాకుండా, కాగిత రహిత ప్రక్రియ ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఖచ్చితమైన గణాంకాల ద్వారా భవిష్యత్తులో అర్హులైన వారికి సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అందించడానికి ఈ డేటా ఎంతో కీలకం కానుందని వెల్లడించారు. వినుకొండ నియోజకవర్గ ప్రజలు ఈ 15 రోజుల గడువులోగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాలని, ఈ ప్రక్రియలో అధికారులకు మరియు సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





## జహంగీర్ భాషను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**(షణ్ముఖ వెలుగు, బద్వేలు, ఏప్రిల్ 16)**
ఇటీవల సీమాంక్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్‌గా ఎన్నికైన షేక్ జహంగీర్ భాషను గురువారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు దళిత నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చురుకుగా పని చేస్తూ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న జహంగీర్ భాషకు పార్టీ అధిష్టానం గుర్తించి సీమాంక్ అభివృద్ధి కమిటీ మెంబర్‌గా నియమించడం హర్షించదగ్గ విషయం అన్నారు. సీమంత ఆస్పత్రి అభివృద్ధికి జహంగీర్ భాష పాటుపడాలని ఆసుపత్రికి వచ్చే రోగులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు గొల్లపల్లి మల్లయ్య, గొడుగునూరు విజయ్, బంక కార్తీక్, రాయప్ప, మారయ్య, సుంకర కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బద్వీడు టు మండల కేంద్రానికి తారు రోడ్డు నిర్మాణం

### కోటి రూపాయలతో తార్ రోడ్డు నిర్మాణం పూర్తి
### బద్వీడు రోడ్డు నిర్మాణం పూర్తి కావడం వల్ల
### ఇన్చార్జి ఎరిక్షన్‌బాబు కు గ్రామస్తుల అభినందనలు



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఏప్రిల్ 16)**
మండలంలోని బద్వీడు గ్రామంలో ఏండ్లతరబడి బద్వీడు నుంచి మండల కేంద్రానికి సరైన రోడ్డు సౌకార్యం లేక ప్రజలు అనేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. నాడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులు చూసి గ్రామ పార్టీ టీడీపీ నాయకుడు కంచర్ల తిరుపాల్ గౌడ్ ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు దృష్టికి తీసుకువెళ్ళారు. రోడ్డును మంజూరు చేయమని కోరగా అడిగిన వెంటనే ఇన్చార్జి ఎరిక్షన్ బాబు తారు రోడ్డు మంజూరుకు కోటి రూపాయలు మంజూరు చేయించారు. మాజీ సర్పంచ్ కంచర్ల చిన్న శేషయ్యగౌడ్ తమ్ముడు మాజీ డీలర్ కంచర్ల చిన్న తిరుపాలుగౌడ్ రోడ్డు నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆశీస్సులు, యర్రగొండపాలెం ఇంచార్జి గూడూరి ఎరిక్సన్ బాబు సహకారంతో రోడ్డు నిర్మాణం జరిగింది. టిడిపి నాయకులు తిరీపాల్ గౌడ్ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలలో కూటమి ప్రభుత్వం ఎరిక్షన్ బాబు సారథ్యంలో అన్ని రోడ్లు పూర్తి చేస్తామన్నారు. గ్రామాలలో అభివృద్ధి చెందాలంటే అది టిడిపి ప్రభుత్వంలో సాధ్యమవుతుందని తిరుపాల్ గౌడ్ అన్నారు. అనంతరం గ్రామస్తులు ఇన్చార్జ్ ఎరిక్షన్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## పారిశుద్ధ్య పనులపై ప్రత్యేకశ్రద్ధ వహించిన అధికారులు



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 16)**
మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో రోడ్ల పై ప్రవహిస్తున్న మురుగునీటిని, దుర్గంధాన్ని వెదజల్లుతున్న చెత్తాచెదారాన్ని తొలగించేందుకు గ్రామపంచాయతీ సెక్రటరీ పద్మ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. గతంలోనే గ్రామ ప్రజలు మురుగు కాలువల పూడికతీత పై ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించలేదు. ప్రస్తుతం వేసవి కాలంలో సంభవించే అనారోగ్యాల పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించింది. అందులో భాగంగా ఏప్రిల్2 తో గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రజా సమస్యలు తీర్చేందుకు అధికారులకు పూర్తి స్వేచ్ఛ లభించింది. దీంతో మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. దీంతో మొదటగా తుమ్మలచెరువు గ్రామంలో మురుగు కాలువల పూడికతీత పనులను చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మ పర్యవేక్షణలో గురువారం గ్రామంలోని పలు వీధుల్లో ఈ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. గత కొంతకాలంగా గ్రామంలోని పలు వీధుల్లో మురుగు కాలువలు, చెత్తాచెదారం, మట్టితో పేరుకు పోయి రోడ్ల పై మురుగునీరు నిలిచిపోవడం జరిగింది. దీని వల్ల దోమల వ్యాప్తి పెరిగి దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గుర్తించిన కార్యదర్శి పద్మ తక్షణమే స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వలి, అబ్దుల్ పాల్గొన్నారు.

## చీరాల టూ టౌన్ సీఐగా ఏ శశి కుమార్

**(షణ్ముఖ వెలుగు, చీరాల, ఏప్రిల్ 16)**
చీరాల టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఏ శశి కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల టూ టౌన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు తావులేదని హెచ్చరించారు. ప్రధానంగా ఐపిఎల్ మ్యాచ్‌లలో యువకులు బెట్టింగులు పెట్టి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రజలు ఏ సమస్యలు ఉన్నా నేరుగా తనను కలవచ్చని కోరారు.



## ఘోర రోడ్డు ప్రమాదం...
## ఇద్దరు స్పాట్ డెడ్



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 16)

చక్రాయపాలెం వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఒక ద్విచక్ర వాహనం, మరొక స్కూటీని కారు ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న అద్దంకి ఇందిరా నగర్ కు చెందిన కొటికలపూడి శ్రీను, గుంటూరుకు చెందిన షేక్ సాంబయ్యలు అక్కడికక్కడే మృతి చెందారు. మరొక వ్యక్తి షేక్ రాజా తీవ్రంగా గాయపడగా అతనిని ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 16)

ఈ నెల 20వ తేదీన మార్కాపురం పట్టణంలోని 'బి" కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా సంబంధించిన పోస్టర్ ను గురువారం కలెక్టరు ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉపాధి, ఉద్యోగాలు అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఎం కంచిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలో వివరాలు నమోదు చేసుకున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు




(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 16)

దేశవ్యాప్తంగా జనగణన గురువారం ప్రారంభమైన నేపథ్యంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తన కుటుంబ వివరాలను సొంతగా నమోదు చేసుకున్నారు. జనగణన తొలిరోజున ప్రజా ప్రతినిధులతో వివరాలు చేస్తుండగా స్థానిక ఎమ్మెల్యేతో జిల్లా రెవిన్యూ అధికారి ఓబులేసు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం నుంచి ఈ నెలాఖరు వరకు స్వీయ గణన జరుగుతుందని, వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికి వచ్చి వివరాలు తీసుకుంటారని డిఆర్ఓ తెలియజేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, 2027 సెన్సస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు, వారు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలన్నారు. అప్పుడే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జరిగిన కార్యక్రమంలో తహసిల్దార్ మురళి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పలువురు నేతలు హాజరయ్యారు.

# పట్టణంలో ఎమ్మెల్యే ఇంటూరి క్షేత్రస్థాయి పర్యటన

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 16)

పట్టణంలోని 13వ వార్డు బండపాలెం, రామ్ నగర్, ఆనందపురం రోడ్డు, 14వ వార్డు శ్రీనగర్ కాలనీ, 16వ వార్డు అజ్మల్ హుస్సేన్ హాస్పిటల్, ముళ్ళపాలెం ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఉదయం పర్యటించారు. మున్సిపల్ కమిషనర్ అనూష, పార్టీ నేతలతో కలిసి ఆయా వార్డుల్లో ప్రతి రోడ్డు, ప్రతి కాలువను నిశితంగా పరిశీలించారు. కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడం, కాలువలపై ఆక్రమణలు, మరికొన్నిచోట్ల కాలువలు పూడిపోవడాన్ని ఎమ్మెల్యే గమనించి... అధికారులపై మండిపడ్డారు. ఉద్యోగాలు ఇలాగేనా చేసేది ? ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా ? ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్నప్పుడు, సౌకర్యాలు కల్పించాలి కదా! అంటూ క్లాస్ తీసుకున్నారు. ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడుతున్న సందర్భాల్లో... పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు సరిగా లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని కాలువలు నెలకొకసారి కూడా శుభ్రం చేయడం లేదన్నారు. దీంతో స్థానికుల ఎదుటే, అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి, కనీసం 10



రోజులకు ఒకసారి ప్రతి కాలువ శుభ్రం చేయాలని సూచించారు. పలుచోట్ల కాలువలపై మెట్లు, బంకులు, ఇతర నిర్మాణాలను గమనించిన నాగేశ్వరరావు వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఒకవైపు కాలువలు ఆక్రమించడమే కాకుండా, వ్యర్థాలన్నీ అందులో పారబోస్తే ఎలా? మున్సిపాలిటీ సుందరంగా ఉండాలంటే మీరందరూ తప్పక సహకరించాలని ఆక్రమణదారులను ఎమ్మెల్యే సున్నితంగా మందలించారు. 16వ వార్డు అజ్మల్ హుస్సేన్ హాస్పిటల్, ముళ్లపాలెం, సిపాయిపాలెం ప్రాంతాల్లో చాలా ఏళ్ల క్రితం నిర్మించిన సైడ్ కాలువలు, ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. పైగా ఇటుకలతో నిర్మాణం వల్ల చాలా చోట్ల దెబ్బతిని మురికి నీరు నిల్వ ఉంటుంది. రోడ్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్నాయి. వీటన్నిటిని పరిశీలించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు వాటి స్థానంలో కొత్తవి నిర్మించేందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణం టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, వార్డు అధ్యక్షులు ఖలీల్, యల్లంటి మాల్యాద్రి, మోసంగి ప్రసాద్, పరిటాల రామకృష్ణ, క్లస్టర్ ఇంచార్జి వడ్డెళ్ళ రవిచంద్ర, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు ఉప్పుటూరి శ్రీను, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, పార్టీ నేతలు పులి నాగరాజు, తలతోటి మస్తాన్, కోటపూరి శ్రీను, జక్కుల రవీంద్ర, శ్రావణ్, బాషా, అబ్దుల్లా, సుభాని, షకీల్, మునాఫ్, కాకుమాని మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.







## పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్యాక్ చేసిన జింక్ ఫుడ్ పదార్థాలు తినకూడదు

### స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్



(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, ఏప్రిల్ 16)

ప్యాక్ చేసిన జింక్ ఫుడ్ 2-6 సంవత్సరాలలోపు పిల్లలకు తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ అన్నారు. పెదర్లపాడు ఎస్సీ పాలెం అంగనవాడి కేంద్రం నందు ఎనిమిదవ పోషణ పక్వాడ 2026 పక్షోత్సవాల కార్యక్రమం ఐసిడిఎస్ సిడిపిఓ సరోజిని ఆదేశాల మేరకు అంగన్వాడీ కార్యకర్త ఎల్ సఫల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్‌లు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు స్థానికంగా లభ్యమయ్యే పోషకాహారాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యం బాగా ఉంటుందన్నారు. అంగన్వాడి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పిల్లల అభివృద్ధి, దశల గురించి సులభంగా వివరించి పిల్లల ఎదుగుదల మరియు అభివృద్ధి సక్రమంగా జరుగుతున్నాయా అనే విషయాన్ని తల్లిదండ్రులకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. పిల్లల పోషణ ఎదుగుదల, మెదడు అభివృద్ధి పై దృష్టి సాధించాలన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి ఆటలు ,పాటలు చిత్రలేఖనం, కథలు, ఆలోచన శక్తి సామాజిక నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించడం, తల్లిదండ్రులు, అంగన్వాడి సిబ్బంది కలిసి ఇంట్లో లభ్యమయ్యే వస్తువులతో బొమ్మలు తయారుచేయడం, సమాజ భాగస్వామ్యంతో శారీరక, చలన నైపుణ్యాల అభివృద్ధిని ప్రోత్సహించడం క్రమశిక్షణ ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఐ మహాలక్ష్మి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## 18 న శ్రీగిరిలో శ్రీవారి వసంతోత్సవం

### శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వసంతోత్సవం కార్యక్రమాన్ని ఈ నెల 18 వ తేదీ శనివారం శాస్రోక్తంగా నిర్వహించనున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు. 18వ తేదీ ఉదయం 8.30 గంటలకు శ్రీవారికి విశేష స్నపన తిరు మంజనం, సాయంత్రం 6 గంటలకు శ్రీవారి వసంతోత్సవం, 7.30 గంటలకు ఊంజల సేవ, బొల్లాపల్లి ఫణి దీప్తి చే గాత్ర కచేరీ జరుగుతాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

## మూడు కోట్ల బీసీ ప్రజల ఆకాంక్ష మేరకు ఆమరణ నిరాహార దీక్ష విరమణ




### 139 బీసీ కులాల జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

మూడు కోట్ల బీసీ ప్రజల ఆకాంక్ష మేరకు భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహార దీక్ష విరమించడం జరిగిందని 139 బీసీ కులాల జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు తెలిపారు. ఒంగోలులోని ఎంసీఏ భవనం నందు జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల ప్రధాన డిమాండ్ల మేరకు ఈ నెల 11వ తేదీన రామచంద్ర యాదవ్ మంగళగిరి కేంద్ర కార్యాలయం వేదికగా ఆమరణ దీక్ష చేపడితే ప్రభుత్వం పట్టి పట్టినట్టుగా వ్యవహరిస్తూ మొండి వైఖరి వ్యవహరించిందని ఆరోపించారు. ఆయనను ఇబ్బందులకు గురి చేయాలని ప్రభుత్వం యత్నించిందని ఆగ్రహ వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న వ్యక్తిని కాపాడుకునే క్రమంలోనే బీసీలు అందరూ కలసి ఆయనచే దీక్ష విరమింపజేయడం జరిగిందని తెలియజేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు బీసీ హక్కుల కోసం పోరాటం చేసిన వ్యక్తి రామచంద్ర యాదవ్ అని అన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలపైన బిసివై పోరాడుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు చల్లా హరి, దూళ్ళ అప్పారావు, శివాజీ, కంభంపాటి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

# క్లిష్ట పరిస్థితుల్లోని పార్టీని గట్టెక్కించిన నారా లోకేష్

# జగన్ అడ్డంకుల్ని అధిగమించి పాదయాత్రతో ప్రభంజనం

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 16)**

క్లిష్ట పరిస్థితుల్లో కుదేలైన పార్టీకి పునర్జీవం పోసి నిజమైన నాయకుడిగా నారా లోకేష్ ఎదిగారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించడంపై మంత్రి గొట్టిపాటి హర్షం వ్యక్తం చేశారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి గురువారం నాడు మంత్రి గొట్టిపాటి ఓ వీడియో విడుదల చేశారు. పార్టీ అత్యంత క్లిష్ట దశలో ఉన్న సమయంలో లోకేష్ చేపట్టిన పాదయాత్ర పార్టీకి కొత్త ఊపిరి పోసిందన్నారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక అడ్డంకులు సృష్టించినప్పటికీ, రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా వెనుకడుగు వేయకుండా లోకేష్ ముందుకు సాగారని తెలిపారు. పాదయాత్ర ద్వారా ప్రజల్లోనే కాకుండా పార్టీ శ్రేణుల్లోనూ ధైర్యం నింపారని చెప్పారు. అనంతర ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్న కఠిన పరిస్థితుల్లో కూడా లోకేష్ నాయకత్వంలో ఒంగోలులో నిర్వహించిన మహానాడు కార్యక్రమం పార్టీ కార్యకర్తలకు కొత్త ఉత్సాహాన్ని నింపిందని గుర్తు చేశారు. మంత్రి నారా లోకేశ్ కృషి, చొరవ వల్లే గత ఎన్నికల్లో టీడీపీ జాతీయ పార్టీలకు ధీటుగా చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని మంత్రి రవికుమార్ స్పష్టం చేశారు.

**కోటికి పైగా సభ్యులకు ఇన్సూరెన్స్‌తో కొండంత అండ..**

జాతీయ పార్టీలకు ధీటుగా తెలుగుదేశం పార్టీని అభివృద్ధి చేసిన నాయకుడిగా నారా లోకేశ్ ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభివర్ణించారు. పార్టీ కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు అనేక కీలక సంస్కరణలకు లోకేశ్ శ్రీకారం చుట్టారని తెలిపారు. కోటికి పైగా సభ్యత్వాలను నమోదు చేయడమే కాకుండా, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అనుకోని పరిస్థితుల్లో మృతిచెందితే తక్షణమే రూ.5 లక్షల ప్రమాద బీమా అందేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. పార్టీ జాతీయ కార్యాలయంలో ముఖ్యమంత్రితో సహా ప్రతిరోజూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమం కార్యకర్తలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో స్థానిక నేతలు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్ మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వ్యవస్థను బలోపేతం చేయడం యువనేత ముందుచూపుకు నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే వారు మండల స్థాయిలో ఉన్నా వారిని గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయి కమిటీల్లో కీలక పదవులు కల్పించడం లోకేష్ సారథ్యంలోనే సాధ్యమవుతోందని మంత్రి రవికుమార్ స్పష్టం చేశారు.

## యువనేత కష్టంతోనే జాతీయ పార్టీలకు ధీటుగా టీడీపీ చారిత్రాత్మక విజయం

### ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**అభివృద్ధితో పాటు సంక్షేమం తోడుగా..**

ఒక వైపు అమరావతి రాజధానితో పాటు ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తూనే పేదలకు పెన్షన్లు, నిరుద్యోగులకు డిఎస్సీ ద్వారా 16,000పైగా టీచర్ పోస్టుల భర్తీ వంటి వాటిలో విద్యా శాఖ మంత్రి లోకేష్ కీలక భూమిక పోషించారని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. విద్యార్థులకు తల్లికి వందనంతో పాటు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలను తీసుకు రావడంలో ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. విద్యా వ్యవస్థలో రాజకీయాలకు తావు ఉండకూడదని ఎటువంటి గుర్తులూ లేకుండా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారంలు పంపిణీ చేసిన ఘనత కూడా మంత్రి లోకేశ్ కే దక్కుతుందన్నారు. చిన్న చిన్న పనులకు కూడా పెద్ద ప్రాపగండాలు చేసుకునే నేటి కాలంలో, లోకేష్ చేసే ఎన్నో మంచి పనులు కేవలం లబ్ధిదారులకు మాత్రమే తెలుసని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ప్రభుత్వం, పార్టీని సమన్వయం చేసుకుంటూ పాలనలో తనదైన ముద్ర వేస్తున్న యువనేత లోకేష్ తో పాటు నూతన కమిటీల్లో పదవులు పొందిన అందరికీ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

---

# స్వీయ గణన ద్వారా ప్రజలందరూ ఐడి నమోదు చేసుకోండి

### తహసీల్దార్ పీర్ మున్ని



**(షణ్ముఖ వెలుగు, బద్వేలు, ఏప్రిల్ 16)**

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుచున్న సెన్సస్-2027కు సంబంధించి బద్వేల్ 16.04.2026 వ తేది నుండి 30.04.2026 వ తేది వరకు స్వీయ గణన (సెల్ఫ్ - ఎన్యూమరేషన్) చేప ట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రజలే నేరుగా వారి యొక్క కుటుంబ సభ్యుల, గృహవసతుల వివరాలను నమోదు చేసుకొనవచ్చునన్నారు, దానికి సంబంధించిన వెబ్ సైట్ నందు మీరే స్వయంగా నమోదు చేసుకొని దానికి సంబధించిన స్వీయగణన గుర్తింపు నెంబరును సెన్సస్ గణన అధికారులు మీ ఇంటి వద్దకు వచ్చిన పుడు స్వీయగణన (సెల్ఫ్-ఎన్యూమరేషన్ ఐడి) గుర్తింపు నెంబరును వారికి తెలియజేసిన ఎడల సంబంధిత ఎన్యుమరేటర్లు వాటిని పరిశీలించి మీ యొక్క వివరాలను పూర్తి చేయగలరన్నారు. కావున అవకాశమును తప్పనిసరిగా ప్రజలందరు వినియోగించు కోవాలని తహసీల్దార్ తెలిపారు.

# స్వీయ జనగణనలో ప్రజలు పాల్గొనాలి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 16)**

నేటి నుంచి ఈ నెల 30 తేదీ వరకు జరగనున్న స్వీయ జనగణనలో ఉత్సాహంగా ప్రజలు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ప్రజలకు సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక యాప్‌లో ప్రజలు స్వచ్ఛందంగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చున్నారు. జనగణన ద్వారా ప్రజల వివరాలు కచ్చితంగా నమోదు కావడంతోపాటు ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రతి పౌరుడు ఈ స్వీయ జనగణనలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# అద్దంకిలో హిజ్రాల మధ్య ఘర్షణ

## డబ్బుల వసూళ్ల వద్ద గొడవ





**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 16)**

పట్టణంలో హిజ్రాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గురువారం భవాని సెంటర్‌లో గుంపులుగా చేరిన హిజ్రాలు పరస్పరం దాడులకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రాయలసీమ ప్రాంతానికి చెందిన హిజ్రాలు డబ్బులు వసూలు చేసే విషయంలో వివాదం చెలరేగినట్లు సమాచారం. వసూళ్ల హక్కులపై జరిగిన వాగ్వాదం క్రమంగా తీవ్రరూపం దాల్చి, ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఈ ఘటనలో పలువురు హిజ్రాలు గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు వెంటనే అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

---

# అంగన్‌వాడీ కేంద్రంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 16)**

ఉలవపాడు సెక్టార్ పరిధిలోని కొల్లూరుపాడు 2 అంగన్వాడి కేంద్రంలో గురువారం సిడిపిఓ డి మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ కె రమాదేవి ఆధ్వర్యంలో గర్భవతులకు, బాలింతలకు 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వారికి 8వ పోషణ పక్వాడ మీటింగు నిర్వహించడం జరిగింది. వీరికి మార్కెట్లో దొరికే జంక్ ఫుడ్ తినడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్య గురించి మరియు సంప్రదాయకరమైన ఆహారం గురించి ప్రత్యక్షంగా తెలియజేయడం జరిగింది. జంక్ ఫుడ్ తినడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు క్యాన్సర్, ఊబకాయం, వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని సూపర్వైజర్ తెలియజేసారు. 0-2 సంవత్సరాల పిల్లలలో ఎదుగుదల ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు పెట్టాలని, వాటిలో బాలామృతం ఏ ఏ పద్ధతిలో వాడాలి అని తెలియజేశారు. ఈ వయస్సు పిల్లలకు ఎదుగుదల ఎక్కువగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఏ డబ్ల్యు డబ్ల్యు టీచర్స్ కె .తిరుపతమ్మ, ఏ. సావిత్రి, డి, పార్వతి, ఏ డబ్ల్యు హెచ్ కె .శోభారాణి పాల్గొన్నారు.

# పొగాకు కొనుగోళ్లు ప్రతిరోజు జరిగేటట్లు ప్రజా ప్రతినిధులు పర్యవేక్షణ చేయాలి

### సిపిఎం డిమాండ్







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 16)**

కందుకూరు 26,27 పొగాకు వేలం కేంద్రాలలో ప్రతిరోజు కనీసం 100 బేళ్ళకు తగ్గకుండా కొనుగోళ్లు చేసేవిధంగా ప్రజా ప్రతినిధులు,బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలని, తద్వారా కందుకూరు నియోజకవర్గం లోని రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కందుకూరు పట్టణంలోని సుందరయ్య భవన్ లో సిపిఎం కందుకూరు నియోజకవర్గ స్థాయి వర్క్ షాప్ ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్ భాషా అధ్యక్షత వహించారు. ఈ వర్క్ షాప్ కు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, యం రమేష్ లు హాజరయ్యారు. మీటింగ్ లో మాట్లాడారు. ఈ సీజన్ లో కొనుగోళ్ల ప్రారంభించడమే ఆలస్యం అయిందని అన్నారు. కొనుగోళ్లు లో కనీసం 15మంది బయ్యర్లు ఉండాల్సిఉంటే 8 మందే ఉన్నారని అన్నారు. కొనుగోళ్లు లో 100బేళ్లు పెడుతుంటే వాటిలో 20 శాతం రిటర్న్ అవుతున్నాయని అన్నారు. ఇంత మందకోడిగా వేలం జరుగుతున్నందున, పొగాకు నిరుత్సాహంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ రకంగా జరిగితే జనవరి మొదటి వారం దాకా కొనుగోళ్లు ఉంటాయని అన్నారు. దీనివల్ల పొగాకు రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని అన్నారు. పొగాకు కొనుగోళ్ల సందర్భంలో ప్రజాప్రతినిధులు తరచూ బోర్డు ను సందర్శించాలని కోరారు. గతం కంటే పొగాకురైతులకు ఖర్చులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కిలో ధర రూ.300 యావరేజ్ ఉండేటట్లు చూడాలని డిమాండ్ చేశారు. వేసవి లో ఎండలు తీవ్రంగా ఉన్న రీత్యా గ్రామాలలోని ప్రజలకుత్రాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కందుకూరు నియోజకవర్గం లోని అన్నీ గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభించి, కూలీలను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం లోని ప్రజలవద్దకు సిపిఎం కార్యకర్తలు ఉద్యమనిధి కొరకు వస్తారని తెలిపారు. ఉదారంగా సహకరించాలని కోరారు. నియోజకవర్గ సమస్యల పై సిపిఎం గుడ్లూరు, ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శులు జీ వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్‌లు మాట్లాడారు. ఈ సమావేశాల్లో కందుకూరు పట్టణం, గుడ్లూరు, వలేటివారిపాలెం, ఉలవపాడు, లింగసముద్రం మండలాలలోని సిపిఎం నాయకులు షేక్ మున్వర్ సుల్తానా, మల్లిక, యం పద్మ, కొట్టే వెంకయ్య, దామా కృష్ణయ్య, బీరకాయల వెంకటేశ్వర్లు, మాదాల రమణయ్య, దువ్వూరి జాన్, గుండ్లతోటి మాధవ మూర్తి, పర్రె భాస్కర్‌రావు, ఎస్‌డి గౌస్ బాషా, ఇందిరావతి, కే శేషమ్మ, గంజి ప్రసాద్, జి శివకుమార్, పొందూరి కొండమ్మ, నారాయణ, ఎస్ సరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

---

# చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సురేష్



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 16)**

గిద్దలూరు పట్టణానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ జంగాల బాలయ్య తన తల్లిదండ్రులైన జంగాల గురవయ్య, సుబ్బమ్మ ల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని సొంత నిధులతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చలివేంద్రాన్ని గిద్దలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి ఒబిలిబోయిన వెంకటయ్య యాదవ్, రాష్ట్ర యాదవ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య పాల్గొన్నారు. బాలయ్య మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహాన్ని తీర్చుటకు తన వంతు సామాజిక సేవ చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమం వేసవి కాలమంతా కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల శ్రీనివాసులు, నంద్యాల పీరయ్య, నారాయణమ్మ, యశ్వంత్ యాదవ్, బాలదీక్షిత్ యాదవ్, రాజ్యలక్ష్మి, కడిదం. శ్రీనివాసులు, ఉమా మహేశ్వరరావు, విశ్వరూపం, శేఖర్, రమణ, తదితరులు పాల్గొని జంగాల బాలయ్యను అభినందించారు.

# నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

# లాడ్జీలు, బస్టాండ్‌లలో పోలీసుల తనిఖీలు

## రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరండి

## లాడ్జి, హోటల్స్ అనుమానాస్పదంగా అన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 16)

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కందుకూరు డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం సూచనలతో కందుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ అన్వర్ బాషా ఆధ్వర్యంలో కందుకూరు టౌన్ ఎస్ఐ నాగరాజు, కందుకూరు రూరల్ ఎస్ఐ బాలకృష్ణ, ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు, స్పెషల్ పార్టీ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కందుకూరు పట్టణంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానిత ప్రదేశాలు, అనుమానిత వ్యక్తుల గృహాలు, పార్సెల్ ఆఫీసుల్లో తనిఖీలు చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తనిఖీలు కూడా నిర్వహించారు. అదేవిధంగా ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలైన బస్టాండ్, ముఖ్య కూడళ్ల వద్ద తనిఖీలు నిర్వహించి, అక్కడ ఉన్న అనుమానిత వ్యక్తులు, వస్తువులను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించి, వారి వేలిముద్రలను ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ ద్వారా తనిఖీ చేయటం నేర నియంత్రణకు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పట్టణంలోని లాడ్జీలను తనిఖీ చేసి, లాడ్జ్ యజమానులకు బస చేసే వ్యక్తుల ఆధార్ కార్డులు, ఇతర వివరాలను నమోదు చేసే విధంగా సరైన రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. రికార్డులు నిర్వహించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టవిరుద్ధంగా గదులు ఇవ్వరాదని, అనుమానాస్పద వ్యక్తులు బస చేసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం కందుకూరు పట్టణానికి వచ్చే ప్రధాన మార్గాలలో వాహనాల తనిఖీలు నిర్వహించి, హెల్మెట్ లేకుండా లేదా సరైన పత్రాలు లేని వాహనదారులపై చర్యలు తీసుకొని రూ. 25,000 జరిమానా



విధించారు. ఈ సందర్భంగా కందుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ అన్వర్ బాషా, మాట్లాడుతూ, కందుకూరు పరిధిలో అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించినప్పుడు లేదా ఏదైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగిన వెంటనే పోలీసులకు, డయల్ 112 సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత వరకు అందరూ కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు తెలియజేశారు.

# రఘురామ కృష్ణం రాజును అరెస్ట్ చేయాలి

## దళిత ఐఏఎస్, ఐపీఎస్, రిటైర్డ్ న్యాయమూర్తులను అవమానిస్తున్న డిప్యూటీ స్పీకర్‌ను పదవి నుండి తొలగించాలి

## రఘురామ "రాముడు గుడి" నిర్మాణం పై హైకోర్టు స్టే పట్ల హర్షం వ్యక్తం చేసిన దళిత నేత నీలం నాగేంద్రరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 16)




రాముడు పేరుతో ఆకువీడు మాలపల్లిలోకి పోలీసు బలగాలతో వెళ్లి బొట్టు లేని మహిళలు అంటూ అవమానించిన డిప్యూటీ స్పీకర్ హోదాలో మాలపల్లి పై దాడి చేసి అక్రమ అరెస్టులు చేయించిన ఆంధ్రా రాజాసింగ్ రఘురామకృష్ణంరాజును మత విద్వేషం చట్టం కింద అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. కందుకూరు పోలీస్ స్టేషన్ ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో నీలం మాట్లాడుతూ పేద ప్రజలు బ్యాంకుల్లో దాచుకున్న వేలకోట్ల రూపాయలను వ్యాపారాల పేరుతో ఫేక్ కంపెనీలు స్థాపించి వేలాది కోట్లు దోచుకున్న, కేసులు ఉన్న మోసగాడు. దళిత అధికారులైన సునీల్ కుమార్, విజయ్ కుమార్, హర్ష కుమార్, జడ శ్రావణ్ కుమార్ లను వీడు వాడు పనికిమాలిన వెధవలు అంటూ పబ్లిక్ గా చంద్రబాబు ,పవన్ కళ్యాణ్ అండతో అవమానించటం కూటమి ప్రభుత్వ సనాతన ధర్మానికి పరాకాష్ట అన్నారు. తమ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని అవమానించారని కార్యకర్తలపై నాన్ బైలబుల్ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్న చంద్రబాబు పవన్ కళ్యాణ్ డిప్యూటీ స్పీకర్ పోస్టులో ఉన్న బ్యాంకు లూటి కింగ్ రఘురామకృష్ణ రాజు పై కూడా కేసు నమోదు చేయించాలన్నారు . ఆకువీడు నియోజకవర్గం లో అనుమతి లేని చర్చిలను కూల్చి వేయటానికి నోటీసు లు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రం లోని అనుమతులు లేని గుడులు, విగ్రహాలను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. ఆకువీడు మాల పేట పై డిప్యూటీ స్పీకర్ హోదా లో, పోలీస్ బలగాలతో టీడీపీ, జనసేన కార్యకర్తలతో వెళ్లి మత ఘర్షణల కు సనాతన కూటమి దాడీ చేయటం హేయమన్నారు. ఆకువీడు ఘటన లో 63మంది మాల ల పై హత్యయత్నం మత విద్వేష చట్టం క్రింద పోలీస్ కేసు లు పెట్టి 10వ తరగతి పరీక్షలు రాయకుండా పిల్లలును, మహిళలను అరెస్టు చేయటం కూటమి ప్రభుత్వం మాలల అణిచి వేతకు నిదర్శనం అన్నారు. మాల ల పై రఘురామకృష్ణం రాజు మనువాద అధికార దాడిని టీడీపీ, జనసేన తో పాటు ప్రతిపక్ష పార్టీ కూడా ఖండించలేదు అన్నారు. జెల్లో వున్న పార్టీ నాయకుల ను జైలు లోపాలకి వెళ్లి పరామర్శించిన జగన్ ఆకువీడు ఎందుకు వెళ్ళలేదు అన్నారు. మాల పేరుతో కుల సంఘాలో మీజ, కార్పొరేషన్ చెర్మెన్ పదవులు పొందిన జూపూడి ప్రభాకర్ లాంటి మాల మేధావులు ఆకువీడు పై ఎందుకు నోరు విప్పడం లేదు అన్నారు. తెనాలి లో మాల యువకులపై పోలీసులు అధికారులు చేసిన డాడీ పై స్పందించి న రాజ్యాంగం నిపుణురాలు హోమ్ శాఖ మంత్రి అనిత, ఆకువీడు మాల భాదితులను పరామర్శిచలన్నారు. ప్రకాశం జిల్లా బండ్లమూడి లోమాదిగ ల పై జరిగిన చిన్న దాడి పై స్పందించి, స్వయంగా విచారణ కు వచ్చి అగ్రకుల నిందితులను రెడ్ల ను అఘామేఘాలమీద స్పందించి అరెస్టు చేయించి న ా. జ కమిషన్ చెర్మెన్ జవహర్ ఆకువీడు మాల పేట ను సందర్శించి మాలలపై దాడి చేసిన రఘురామకృష్ణంరాజు ముఠాపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టి అరెస్టు చేయాలన్నారు. ఆకు వేడు మాలలపై ఓటమి ప్రభుత్వ సనాతన దాడిలో పాల్గొన్న రఘురామకృష్ణ రాజు పై ప్రైవేటు కేసు హైకోర్టులో వేస్తామన్నారు . ఆకివీడు మాల పేటలో రఘురామ రాజు మాలల మనోభావాలను వ్యతిరేకిస్తూ నిర్మించ తలపెట్టిన రాముడు గుడి నిర్మాణం పై హైకోర్టు స్టే విధించడం పై దళిత నేత నీలం నాగేంద్ర రావు హర్షం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు పాలేటి కోటేశ్వరరావు, అయ్యన్న, మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాకుమాను రవి, మేడికొండ మురళి, యానాది సంఘం నాయకులు కోలా జీవరత్నం, బొమ్మల వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలులో జనాభా లెక్కల ప్రక్రియను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

ఒంగోలు నగరంలో జనాభా లెక్కల ప్రక్రియ నేటినుంచి ప్రారంభమైందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన జనాభా లెక్కల ప్రక్రియను ఎమ్మెల్యే జనార్దన్ ఇంటి నుండి ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆన్లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఈనెల 16వ తేదీ నుండి 30వ తేదీ వరకు జనాభా లెక్కల ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి వచ్చినప్పుడు పూర్తి వివరాలు అధికారులకు అందించి సహకరించాలన్నారు. ఇప్పుడు ఇంటి పరిస్థితి ఎలా ఉంటుంది, ఆర్థిక పరిస్థితి ఏమిటి, కుటుంబ స్థితిగతులను మొత్తం పూర్తిగా అధ్యయనం చేసుకునేందుకు ఈ సర్వే జరుగుతుందన్నారు. మే ఒకటో తేదీ నుండి 30వ తేదీ వరకు కుల గణన కూడా సాగుతుందని తెలిపారు. ఇంటి యజమాని తప్పనిసరిగా వారి యొక్క వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, సిబ్బంది అఖండ, కాలేశా, సుజాత పాల్గొన్నారు.

## కాపు భవనం స్థలం కేటాయింపుకై వినతి



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఏప్రిల్ 16)

కాపు భవనం స్థలంకోసం గురువారం బద్వేలు నూతన తహసిల్దార్ షేక్ పీర్ మున్ని కి బద్వేలు బలిజ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఇందులో భాగంగా కాపు భవనం స్థలం కేటాయింపు కొరకు వెంటనే పరిశీలించి బద్వేల్ యందు స్థల సేకరణ చేయవలసిందిగా ఆమెను కోరారు. ఈ విషయపై తహసిల్దార్ సానుకూలంగా స్పందించి అతి త్వరలో మీకు స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి కొంకుల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు కొర్రపాటి సురేంద్ర, పండుగాయల శ్రీనివాసులు, నీలి శ్రీనివాసులు, వావిళ్ళ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విచారణలో ఉన్న ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయం న్యాయ సేవలు అందిస్తున్నాం

### జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్‌పర్సన్ టి రాజ్యలక్ష్మి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

విచారణలో ఉన్న ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మండల న్యాయ సేవా అధికార కమిటీలు అందజేస్తున్నాయని జిల్లా న్యాయ సేవ అధికార



సంస్థ చైర్పర్సన్, ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో గల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం నందు నిర్వహించిన అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్‌లో న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లా జైలు, ప్రకాశం జిల్లావ్యాప్తంగా ఉన్న సబ్ జైల్స్ లోని ఖైదీలకు అందుతున్న సదుపాయాలను, అర్హత కలిగిన ఖైదీలకు అందించే న్యాయ సహాయం గురించి జిల్లా రెవెన్యూ యంత్రాంగం, జిల్లా పోలీస్ యంత్రాంగంతో, జైలు అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్, జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి బి చిన్న ఓబులేసు, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్లు, జైలు శాఖ అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## చిన్నగంజాంలో పోషణ పక్వాడ కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 16)

గర్భవతులు సరైన టైంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యం, పోషణ పట్ల శ్రద్ధ వహిస్తూ మెరుగైన అంగన్వాడీ సేవలను పొందాలని సూపర్వైజర్ సుమలత అన్నారు. గురువారం మండలంలోని సోపిరాల 2 అంగన్వాడీ కేంద్రం నందు 8వ పోషన్ పక్వాడ పక్షోత్సవం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సుమలత మాట్లాడుతూ పోషన్ పక్వాడ కార్యక్రమం ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో 15 రోజులు జరుగుతాయన్నారు. అలాగే గర్భవతులు ప్రతి నేల పీహెచ్సీలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని గర్భధారణ సమయంలో ఆహారం, సంరక్షణ, సరైన బరువు, పెరుగుదల మొదలగు విషయాలపై గర్భిణీలకు అవగాహన కలిగి వుండలన్నారు. అంతేకాకుండా బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం, కేవలం ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, 7వ నెల నుండి అనుబంధ ఆహారాన్ని అందించడం మొదలగు విషయాల మీద అవగాహన కల్పించారు. అలాగే పిల్లల ఆరోగ్యం పై శ్రద్ధ కలిగి ఉండాలని, జింక్ ఫుడ్ వల్ల ఊబకాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, గర్భవతులు, తదితరులు పాల్గొన్నారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ ఉచిత మెగా వైద్య శిబిరం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

స్థానిక గోపాల్ నగర్‌లోని గోపాలకృష్ణ కళ్యాణ మండపంలో సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎందేటి పూజిత (ఎందేటి రఘువీర్, నందిని రమణ కుమార్తె) పుట్టినరోజును పురస్కరించుకుని నిర్వహించిన భారీ ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా ముగిసింది. ముందుగా ఈ వేడుకలో భాగంగా ముఖ్య అతిథులు పూజిత తాతయ్య ఎందేటి సుబ్బారావు సమక్షంలో చిన్నారి పూజిత చేత కేక్ కట్ చేయించి పుట్టినరోజు వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఆడంబరాలకు దూరంగా, పేద ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 450 మంది రోగులు పరీక్షలు చేయించుకోగా, 600 మందికి మజ్జిగ, భోజన సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా వేదిక పై ముఖ్య అతిథులు, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు తమ సందేశాలను అందించారు. ఏపి పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ చిన్నారి పుట్టినరోజున వందలాది మందికి మేలు చేకూర్చే ఇలాంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఉపాస హాస్పిటల్ ఎండి డాక్టర్ ప్రకాష్ చవల గారు మాట్లాడుతూ, వైద్యం సామాన్యులకు చేరువ కావాలన్న లక్ష్యాన్ని ఈ శిబిరం నెరవేర్చిందని, ఇలాంటి సేవా యజ్ఞంలో భాగమవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. ఉష హాస్పిటల్ ఎండి డాక్టర్ వై సునీల్ కిషోర్ మాట్లాడుతూ సామాజిక స్పృహతో నిర్వహించిన ఈ శిబిరం ఎందరో పేద రోగులకు వరంగా మారిందని పేర్కొన్నారు. సుధా డెంటల్ ఎండి డాక్టర్ అవినాష్ గారు మాట్లాడుతూ దంత వైద్యం వంటి ఖరీదైన సేవలను పుట్టినరోజు కానుకగా ఉచితంగా అందించడం గొప్ప సంకల్పమని ప్రశంసించారు. శ్రీరామ్ హాస్పిటల్ ఎండి డాక్టర్ చౌపల వంశీకృష్ణ మాట్లాడుతూ వేల రూపాయల విలువైన పరీక్షలను ఉచితంగా అందించడం సమాజం పట్ల నిర్వాహకులకు ఉన్న గౌరవానికి చిహ్నమని కొనియాడారు. దాత ఎందేటి సుబ్బారావు మాట్లాడుతూ తన మనవరాలి పుట్టినరోజు వేడుకను పేద ప్రజల సేవలో భాగం చేయడం తమ కుటుంబానికి ఎంతో తృప్తినిచ్చిందని తెలిపారు. ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ సహనాజ్ మాట్లాడుతూ సూర్యశ్రీ ట్రస్ట్ ఎప్పుడూ సమాజ హితం కోరుకుంటుందని, పూజిత పుట్టినరోజున ప్రముఖ ఉపాస్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత పరీక్షలు, మందులు అందజేయడం విశేషమని పేర్కొన్నారు. స్మార్ట్ విజన్ డాక్టర్ విష్ణు ప్రియ గారు మాట్లాడుతూ, వందలాది మందికి కంటి చూపుపై అవగాహన కల్పించి సేవలందించడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ వేడుక కేవలం ఒక కుటుంబ వేడుకలా కాకుండా సామాజిక యజ్ఞంలా జరగడం నిజమైన మానవత్వమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ భాష, ట్రస్టు గౌరవ సలహాదారులు సుబ్బారావు, మారెళ్ళ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా 600 మందికి పైగా మజ్జిగను అందజేశారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన వారందరికీ భోజన ఏర్పాట్లు చేశారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన డాక్టర్లకు, దాతలకు ట్రస్ట్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.












# ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల ముందడుగు

## బ్లాక్ స్పాట్‌లు, గ్రామాల నుంచి నేషనల్ హైవేకు కలిసే జంక్షన్లు, ప్రమాదకర మలుపుల్లో కుంభాకార దర్పణాల ఏర్పాటు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్కాపురం, ఏప్రిల్ 16)



ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు జిల్లా పోలీస్ శాఖ పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రమాదాలు తరచుగా జరుగుతున్న ప్రదేశాలు, ముఖ్యంగా బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాల్లో కుంభాకార దర్పణాలు అమర్చడం ద్వారా వాహనదారుల భద్రతను పెంచే దిశగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రప్రమాదకరమైన మలుపులు, జంక్షన్లు, టి జంక్షన్, వై జంక్షన్, యు టర్న్, విజిబిలిటీ తక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు సులభంగా కనిపించేలా కుంభాకార దర్పణాలు పై సైన్ బోర్డు కనిపించే విధంగా ఏర్పాటు చేశారు. ఈ దర్పణాలు వాహనదారులకు ముందస్తు అవగాహన కల్పించి, ప్రమాదాలను నివారించడంలో ఏంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. ఈ దర్పణాలను సరైన విధంగా ఎలా అమర్చాలి, వాటి ఎత్తు, కోణం, స్థాన ఎంపిక వంటి అంశాలపై పోలీస్ అధికారులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డెమో కార్యక్రమమును గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ డెమోలో ట్రాఫిక్ నిర్వహణలో పాటించాల్సిన ప్రమాణాలు, రోడ్డు భద్రతకు సంబంధించిన ముఖ్య సూచనలు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది అధికారులకు వివరించారు. ఫీల్డ్‌లో పనిచేసే అధికారులకు ప్రాక్టికల్‌గా చూపిస్తూ, దర్పణాల సరైన వినియోగంపై పలు సూచనలు చేశారు. ప్రమాదాలను పూర్తిగా నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జిల్లా పోలీస్ శాఖ తీసుకుంటున్న ఈ చర్యలకు ప్రజల సహకారం కూడా అవసరమని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ, వేగ నియంత్రణ పాటించడం, మలుపులు వద్ద జాగ్రత్తగా వాహనాలు నడపడం, రోడ్డు పరిస్థితులను గమనించడం వంటి అంశాలను కచ్చితంగా అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రతి ఒక పోలీసు స్టేషన్ నుండి ఎస్ఐ పాల్గొన్నారు.



# విద్యుత్ రంగంలో మెరుగైన సేవలు

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 16)

నియోజకవర్గ ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం వినుకొండ పట్టణంలోని పలు వార్డుల్లో లో-వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. ముఖ్యంగా 29వ వార్డు (హనుమాన్ నగర్) లో నెలకొన్న విద్యుత్ అంతరాయాలను తొలగించేందుకు రెండు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను, అలాగే 17వ వార్డు (పెద్దనాల్సా బజార్) లో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# సీఐ డి వినోద్ కుమార్‌ను సత్కరించిన మల్లికార్జునరెడ్డి

## మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ మల్లికార్జునరెడ్డి

(షణ్ముఖ వెలుగు, పామూరు, ఏప్రిల్ 16)




పామూరు సర్కిల్ సీఐగా నూతన బాధ్యతలు స్వీకరించిన సీఐ డి వినోద్ కుమార్‌ను మల్లికార్జున రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి మల్లికార్జునరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి శనివారం నిర్వహించనున్న 17వ వారపు అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ తప్పకుండా అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటానన్నారని తెలిపారు.

# వార్షిక రుణ జీవనోపాధుల సర్వే 2026-27 పై శిక్షణ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 16)

డిఆర్‌డిఏ ఆఫీస్ నందు వార్షిక రుణ ప్రణాళిక, జీవనాపాదులు 2026-27 పైన గ్రామ సంఘం ఓబీలు, విఓఏలు, ఈ నారీలకు గురువారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. 2026 -27 ఆర్థిక సంవత్సరంలో గ్రూపు సభ్యులకు బ్యాంకు రుణాలు, శ్రీనిధి ,ఉన్నతి, సిఐఎఫ్ రుణాలు కావాల్సిన వారికి ఈ జీవనోపాధిలా సర్వేలో నమోదు చేసుకోవాలన్నారు. ఇందులో నమోదు చేసుకున్న వారికి ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఏపిఎం గోపాలకృష్ణ తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి గ్రూపు సభ్యురాల వారీగా సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 20 జీవనోపాదులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఏపిఎం గోపాలకృష్ణ, సీసీలు దాసు, రాజయ్య, వెంకటరెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు మెహరున్నిసా బేగం, సెక్రెటరీ అరుణ, ట్రెజరర్ సులోచన, అకౌంటెంట్ శ్రీదేవి, శ్రీనిధి మేనేజర్ బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ రాజాబాబుని కలిసిన బసనేపల్లి రాజశేఖర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 16)

ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబుని నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ జిల్లా చైర్మన్ బసనేపల్లి రాజశేఖర్ గురువారం తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రకాశం జిల్లాలో అమలవుతున్న పర్యావరణం గురించి, జిల్లాలో చేపడుతున్నా వివిధ రకాల ప్రభుత్వ పథకాల గురించి, ప్రస్తుతం ఉన్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, పర్యావరణ ప్రేమికులు కొన్ని సూచనలు చేయడం జరిగింది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని రాబోవు రోజులలో అమలు చేస్తావని, మీరు కూడా పర్యావరణానికి దగ్గరుండి వివిధ రకాలుగా సహాయ సహకారాలు అందించాలని ముఖ్యంగా రాజశేఖర్‌కి తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ శాలువతో సత్కరించి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు శ్రీహరి, గుర్రం సత్యనారాయణ, గణపతి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.